# ఆడదాని జీవితం...

రచన: శ్రీ. డి. పేర్రాజు

'మా యింటికి వెళ్ళగానే మా శ్రీమతి దాడు నివేదించే సాధింపులూ, మీ యింటికి పోగానే మీ అమ్మగారు ఇవ్వబోయే బహుమానాల సంగతి ఆలోచించు' అన్నాడతను.

'ఏమిటి మాస్టారూ! మీ కెప్పుడూ ఇంతే. చరిత్ర ఎంతో కుతూహలంతో తెలుసుకొనగోరే జూనియర్ క్లాసు స్టూడెంట్సు అంటేనే మీకు ఇష్టముండదు. సీనియర్ స్టూడెంట్సు మీ కేదో త్రవ్వి తలకెత్తుతారని ఆశ' అంది దెప్పి పొడుపుగా, ఆమె సందేహం తీర్చలేదనే ఉడుకు మోత్తనంతో.

ఇంతలో వారి ప్రక్కనుండి, చూడ ముచ్చటగానున్న పొడుగాటి తెల్లని రంగుల ఫ్లిమత్ కారు వారిరువురినీ దూసుకొని వెళ్ళిపోయింది. ఆ కారు హెడ్ లైట్స్ కాంతి వారిపై పడి, కారులోని వారికి వీరెవరో తెలిసి ఉండవచ్చు. కానీ వారిరువురికీ మాత్రం కారులోని వారు అగుపడలేదు.

అతను శశికి 'గుడ్ నైట్' చెబుతూ, "శశీ ఇంక చరిత్ర పాఠాలు బీచ్‌లో ఆపివేద్దాం. నన్నెప్పుడూ స్టాఫ్ రూమ్‌లో, విశ్రాంతి సమయాల్లో కలుసుకొని, నీ సందేహాలు తీర్చుకో. ప్రతి రోజూ, రాత్రి ప్రొద్దుపోయే వరకూ, మనమీ బీచ్‌లో కూర్చుని చర్చించేవి చరిత్ర సంగతులైనా, నీ గురించి పలువురు పలువిధాలుగా మాటలాడుతారు. మగవాడిని, వివాహితుడనైన నా గురించి చింత లేదు. నీవు అందమైన అబలవు. అవివాహితవు. ఆ మాటలే నీ భవిష్యత్ జీవితపు బాటను దుర్గమయి ధూయిస్త్వ చేస్తాయి' అని వెళ్ళిపోయాడతను.

శశి బి. ఏ. మొదటి సంవత్సరం చదువుతోన్న చిన్నారి. ఆమె తన నల్లని సోగ కనులతో కాలేజి కుర్రాళ్ళనందరినీ మజ్నూలుగా మారుస్తోంది. సింహమధ్య, చంద్రబింబాననే, హరిణాక్షిణే, లతాంగి- మున్నగు కవిశేఖరుల వర్ణనల కర్హమైన కవితారాణియై, శృంగార నాయికివలె ఉన్న ఆమె, తన వయసు సొగసుల కోడుగా కోరికొని తెచ్చుకొన్న కులుకు బెళుకుల నడకలను కనిన కాలేజీ విద్యార్థులందరూ అపర దేవదాసు లయ్యారు. పి. యు. సి. లో చేరిననాటి నుండీ నేటివరకూ ఆమెయే మిస్ కాలేజీగా వ్యవహరింప - బడుతోంది, శృంగారకొండను ప్రధాన విషయంగా తీసుకొని పరిశోధిస్తూన్న కొందరు విద్యార్థులచే ఆమె అప్పుడప్పుడు అద్దంలో చూసుకొని తన అందానికి తానే సమ్మోహితురాలయేది. పక్కింటి పిన్నిగారి పాపాయిని ఎత్తుకొనిన సమయంలో, ఏడాది అయినా నిండని ఆ పసిపాప కూడా శశి లేత గులాబి రంగు బుగ్గలను చూసి, ఏదో తినేవస్తువు అని భ్రమిసి, తన చిన్నారి చిరుబోసి నోటితో నాకబోయేటంతలో, తన సొంపగు చెక్కిళ్ళు ఎక్కడ మలినమవుతాయో అని, 'అ......అ......ఎమిటి పాప అల్లరి. నీకు కూడా నా అందమేనా కావలసింది' అని ఆ పాపను ముద్దిడి, ఆ ప్రయత్నం నుండి విరమింపజేసేది. అందాన్ని అంటనంత సేపే ఆకర్షణీయంగా అగుపడేది. అంటుకో బోతే ఎండమావులవలె అదృశ్యమవుతుందని ఆ పసిపాపకు ఎలా తెలుస్తుంది. ఏమిటి ఈ పిచ్చి. ఎందుకో ఈ 'అహం' అనే ఈ వెర్రి. ఎవరికొరకో? ఎంతకాలమో? ఈ అందాన్నింత పదిలంగా కాపాడడం? ఏమిటో ఈ జీవితపు పరమార్థం?—మున్నగు పిచ్చి పిచ్చి ప్రశ్నలు తనను వేధిస్తూంటే తల్లడిల్లిపోయేది. శశి లేత హృదయం. ఇట్టి ఆలోచనలు ఆమెను ముప్పిరిగొని ఉన్న సమయ్యాలో, శశి పరాకును గమనించిన పసిపాప, గభాలున తన చిట్టి నోటిని శశి చెక్కిళ్ళకు అంటించి చక్కిలిగింతలు కలిగించి, చిట్టిబోసి నోటితో చిరునవ్వులు చిందిస్తూ, నా ప్రయత్నంలో జయమొందానన్నట్లు, విజయ గర్వంతో చూసేది శశివంక. ఆవిధంగా పసిపాపచే మోసగింపబడి, ఆ పాప ఆనందం కొరకు తన అందం ఉపయోగపడినట్లుగా, తన అందచందాలూ వయసు సొగసులూ తనకు తెలియకనే పరుల అధీనం కావుకదా అనే భయంకర ఆలోచన కలిగేది, ఆమె కు

కాలేజి మెయిన్ గేటుకు సుమారు ఐదు ఫర్లాంగుల తర్వాత ఊరిలోనికి పోయేటందుకు గల, జనసంచారం కొంచెం తక్కువగా ఉన్న ఒక రోడ్డుకు అడ్డంగా, తన చూడముచ్చటైన పొడుగాటి తెల్లని రంగుగల కారును నిలిపి, తన ప్రణయ సామ్రాజ్య రాజ్ఞిని నిజంగా తన హృదయరాణిగా చేసుకోడానికి అనుమతి అడుగుటకు ఆ ప్రణయ దేవతనే జపిస్తూ వేచి ఉన్నాడు, శశియొక్క అసంఖ్యా ప్రేమ పూజారులలో ఒకడయిన మధు.

రానే వచ్చింది, అతని ఊహాసుందరి. దారి కడ్డుగా ఉన్న కారును చూసి, అటుపిమ్మట అతనిని చూసి 'ఓహో ఇది నీ ప్రతాపమా' అని, అనుకొని, ప్రక్క నుండి కొంచెం కష్టంతో పోబోతూంటే కారును అడ్డు తొలగించి, ఆమెను వెంబడిస్తూ 'మేడమ్ నా లేఖ అందిందాండీ' అని అడిగాడు. మధు, మధురంగా ఫోజులనిస్తూ కాయశక్తులా ఆ ప్రేమ ఇంటర్వ్యూలో జయమొంద యత్నిస్తూ 'మిస్టర్ ఇది నీ జీవితంలో ఎన్నోసారైనా, నాకు సంబంధించినంత వరకిది ప్రథమ అనుభవం కనుక క్షమిస్తున్నా, ప్రిన్సిపాలుకు ఫిర్యాదు చేస్తే నా ప్రాణాలకు ఉసూరు మనుకొంటూ డిబార్ అవుతావు జాగ్రత్త' అంది రౌద్రాకారంతో,

'అందని మ్రాని పండ్లు పుల్లన' అను సామెతను సార్థకపరచేలా, ఆమె తన కోరికను మన్నించలేదనే ఉడుకు మొత్తనంతో, అప్పటి ఆమె రూపాన్ని చూచిన మధు పెంకిగా ఆగ్రహంలోకూడ అందంగానే ఉంటా రండి మీరు. గుణం లేనివారైనా పౌరుషం లేనివారు మాత్రం కాదు.

మీ ప్రేమ భిక్షకొరకై మీ పాదములపై పడి వేడుకొన్న సర్వ అర్హతలూగల నన్ను కాదని కాలదన్ని అనరాని పరుష వాక్యాలు పలికినారు మీరు. నేడు నే పొందిన పరాభవానికి ఫదింతలు మీరూ ఒకనాడు నా చేతనే పొందగలరు. అన్నప్పుడల్లా అందరికీ అనుకూలంగా ఉంటుందని భావించకండి' అని కారును వెనుకకు మరల్చి, విసురుగా వెనుదిరిగి పోయాడు, అందచందాల ఆరాధకుడలా అభినవ పుండరీకుడయిన అందాల మధు.


# THE VYSYA BANK LIMITED

Estd : 1930 : : A Scheduled Bank

*Registered Office & Head Office :*

VYSYA BANK BUILDING, Avenue Road, Bangalore-2.

SRI YADALAM S. GOPALAKRISHNA SETTY, *Chairman.*

**SAFE DEPOSIT LOCKERS**

of various sizes are available at reasonable rates at HEAD OFFICE, Bangalore City.

INTEREST ALLOWED ON SAVINGS BANK DEPOSITS AT **$3\frac{1}{4}$ %** P. A.

Interest Allowed on Fixed Deposits for 1 to 5 Years at $4\frac{1}{2}$% to $5\frac{1}{2}$% P. A.

Save and Earn through our NEW CUMULATIVE DEPOSITS

Interest yield from 5% to $5\frac{3}{8}$% P. A.

THREE YEARS CASH CERTIFICATES yielding Interest about 5% P. A. are being issued.

PLEASE CONTACT ANY OF OUR OFFICES :

J. SURYANARAYANA CHETTY,

*General Manager.*

మధు కలవారి పుత్రవాడు. కాలక్షేపం కోసం కాలేజికి హాజరవుతూ, కంటికి నదరుగా ఉన్న కన్య కామణులను చేజిక్కించుకొని, అవసరం తీరినంతనే ఆ అభాగ్యులను మరచిపోగలిగే అపర కలియుగ పురుషుడు. మధు చేతులు యాంత్రికంగా స్టీరింగును త్రిప్పుతున్నాయి అతని ఆలోచనలన్నీ సెలజాన శశిపైనే. 'ఏమిటి ఈ శశి మనస్తత్వం? ఎన్ని రోజుల నుండి ప్రతిమాలినా చేజిక్కదేం? అందగత్తెననే అహంకారమా?... ఏమో? మొన్న ఒక రోజు రాత్రి చరిత్ర లెక్చరర్‌తో బీచ్ రోడ్డుపై అగుపించిదేం? అంత రాత్రివరకూ బీచ్‌లో చరిత్ర లెక్చరర్‌తో గడిపి నేర్చుకోనవలసిన పాఠాలేమిటో ఆమెకు!' అని పరిపరివిధాల ఆలోచనలతో తమతమై మిత్రులగు వేణూ, అరుణల ఇళ్ళకు వెళ్ళి సంగతి వివరించాడు. 'శశి' కి మరునాడు కాలేజీలో గట్టి గుణపాఠాం నేర్పాలని నిర్ణయించుకొన్నారు ఆ మిత్రత్రయం.

శశి మామూలుగా తన క్లాసు పుస్తకాలను పొందికగా పట్టుకొని, తలవంచుకొని రాజహంసలా, మందగమనయై నడచి వస్తోంది. ఆమె తమ వద్దకు రాగానే ఆ మిత్రత్రయంలోని ఒకడైన అరుణ 'ఏరా వేణూ నీవుకూడా రోజూ అర్ధరాత్రివరకు బీచ్‌లో చరిత్ర పాఠాలు చెప్పించుకోకూడదూ?' అని అడిగాడు. అప్పుడు వేణూ 'శశి' వంక వ్రేలితో చూపిస్తూ 'ఇటుంటి వగురువె ఎవరైనా దొరికితే అర్ధరాత్రి వరకేం ఖర్మం తెల్లవారే వరకు చెప్పించుకొంటాను పాఠాలు ...... ప్రేమగురించి అని కొంచెం మెల్లిగా అన్నాడు. ఆ మాటలను వినిన శశి అవమానంతో బెదరిన లేడిలా, అదిరే అధరాలతో, కన్నీటి చంచల నేత్రాలతో, వారందరి వంక చూసి 'మీకేం పనీ పాటూ లేదా? వాళ్ళను, వీళ్ళను నోటికి వచ్చినట్లు సూటీపోటీ మాటలాడడానికేనా మీరు కాలేజికి వచ్చింది? నా వంటి చెల్లెళ్ళూ అక్కలూ మీకు లేరా? వారిని కూడా మీ వంటి తుంటరులు ఈ విధంగానే పరిహసిస్తే మీకెలా ఉంటుంది? మీవి మానవ హృదయాలు కావా? ''అంటూ కళ్ళనుండి కారే కన్నీటి ప్రవంతిని తనకుతానై ఆపుకొంటూ పలికిందా మాటలన్నీ వణికే కంఠంతో.

Phone : 2433 Estd : 1938 Tel : "SOCIETY"

The Government of Madras has awarded a SHIELD
to our society as the

BEST WEAVERS CO-OPERATIVE SOCIETY
IN TAMILNAD

- Quality
- Durability
- Economy
- Style
- Fastness in colour
- Up-to-date Design

*Contact :*

**THE AMMAPET HANDLOOM WEAVERS' CO-OPERATIVE PRODUCTION & SALE SOCIETY LTD. S. 532**

**AMMAPET, SALEM-3.**

**(TAMILNADU)**

ఆ దృశ్యాన్ని చూసిన నేను, 'తమవలెనే చదువుకొనుటకు వచ్చిన, ఇట్టి అబలలపై మధువంటి వారెందుకో మృగతుల్యులై ప్రవర్తిస్తారు' అనుకొంటూ, అది గమనిస్తూ, అచ్చటనే నిలబడ్డా నేను కూడా. కాలేజీల్లో సాధారణంగా ఇటువంటి ఏ చిన్న సంఘటన జరిగినా చుట్టూమూగే విద్యార్థినీ విద్యార్థులు తాము ఆ దుర్ఘటనను ఏ విధంగానూ నివారించరు సరికదా, అది ఏదో తమాషాగా చూసి ఆనందిస్తూ విలాసంగా ఫోజులు ఇస్తూ నిలబడతారు. ఎద్దు పుండు కాకికి రుచి! ఈ సంఘటన ఆరంభమయిన తత్క్షణంకూడా అదేవిధంగా అప్పుడే తరగతులలోనికి ప్రవేశించబోతూన్న విద్యార్థినీ విద్యార్థులు అచ్చట గుమిగూడసాగారు.

ఆమె మాటలను విన్న మధు సిగరెట్ పొగను విలాసంగా రింగులు రింగులుగా ఆమె కళ్ళల్లోనికి ఊదుతూ 'మా చెల్లెళ్ళూ అక్కలూ నీవలె రాత్రిళ్ళు పాఠాల కోసం బీచ్‌కి పోరు' అన్నాడు.

ఇక నేను ఊరుకోలేక 'ఇది మన కాలేజి ప్రతిష్ఠకే భంగకరమైన విషయం. ఆ అమ్మాయి వ్యక్తిగతపు గొడవలను గురించి మాట్లాడడం, నీవంటి అన్నం తింటూన్న విద్యార్థులకు తగనిపని. ఇక ఈ దుస్సంఘటనకు ఇంతతో మంగళం పాడి మర్యాదగా నీవు నిష్క్రమించకుంటే మనమందరం ఇప్పుడు ప్రిన్సిపల్ వద్దకు పోవలసి ఉంటుంది,' అన్నాను ఒడలెరుగని కోపంతో ఆవేశంగా.

అందమైన అమ్మాయిని ఏడిపిస్తూంటే మిగతా విద్యార్థులందరివలెనే నేనుకూడా ముసిముసి నవ్వులు నవ్వుతూ ఆ సన్నివేశాన్ని చూసి ఆనందించి ఊరుకోనక ఆవిధంగా వ్యతిరేకంగా పలకడంతోనే మధు, తనకు బలమైన ప్రతిపక్షపు ప్రతిఘటన ప్రారంభమైనదని గమనించి నీ వామె తరపున 'వకాల్తా' పుచ్చుకొన్నావా? అని గొణుకుకొంటూ నిష్క్రమించాడు.

భరింపరాని అవమానంతోనూ, దుఃఖంతోనూ చుట్టూ తోటి విద్యార్థినీ విద్యార్థులు కాకిమూకలవలె మూగి చూచే చూపుల చూపులతో, చిత్రవధ కావింపబడుతూన్న, ఆ లేజవరాలికి నేను అండగా నిలబడడంతో, కొండంత ధైర్యం వచ్చి—తన దుఃఖాన్ని దిగమ్రింగుకొని, ఆ అల్లరిమూక బారినుండి రక్షించిన నాకు నిండు హృదయంతో నమస్కరిస్తూ కృతజ్ఞత తెల్పి 'అవమానాగ్నిచే దహింపబడుతూన్న ఈ అభాగ్యురాలిని ఆదరించి రక్షించారు. మీరు ఈ దీనురాలికి చేసిన సహాయాన్ని భగవానుడెన్నడూ మరువడు' అని పోబోతూంటే, నేనామెతో 'చూడండీ లోకులు కాకులు. అందులోనూ మన కాలేజి విద్యార్థులు తోకలేని కోతులు. వారి ఇకిలింపులకు, వెకిలి మాటలకు మీరు అనవసరంగా బాధపడకూడదు.

"మీరు బాధపడినకొద్దీ ఇంకా ఏడిపిస్తారు. మీరు ఏమీ లక్ష్యపెట్టక—పోతే తాము పడ్డ శ్రమ వృధాయని ఆ ప్రయత్నంనుండి వారు విరమించుకొంటారు. ఎగిరే బంతినే ఎవరైనా కొడతారు. పలికే వీణనే ఎవరైనా వాయించ ప్రయత్నిస్తారు. ఎరగని బంతిని, మూగవోయిన వీణనూ ఎవరూ చూడనైనా చూడరు. ఈ సత్యాన్ని దయచేసి మీ రెన్నడూ మరువకండి' అని నా తరగతి గదిలోనికి వెళ్ళిపోయాను.

మరుసటి సంవత్సరం......

'ఏమండీ బి. ఏ. సీనియర్ తరగతి విద్యార్థుల గది ఇదే నాండీ' అని ఎవరో పలకరిస్తే వెనుదిరిగి చూసాను. ఇంకెవరూ, నాడు మధువలన నలుగురిలోని అవమానింపబడిన శశిరేఖయే. 'ఓహో మీరా రండి రండి ఇదే ఇక నుండీ మీ తరగతి గది అన ఆహ్వానించాను. 'మరి మీరూ.....' అంది. ఇంకా ఈ ఏడుకూడా ఈ తరగతిలోనే ఉన్నారేం మహానుభావా' అనే భావంతో. 'నిరుడు మధ్యలో కారణాంతరాలవలన మానివేశానండీ. కనుక మీవంటి పిన్నలతో చదువవలసి వస్తోంది.' అన్నా సిగ్గుతో.

నా ప్రక్కనున్న మిత్రునివంక కుతూహలంగా చూసింది, 'ఎవరో అన్నట్లు' నదరుగా అనే కరుణకుమార్‌వంటి సుందర యువకుల వంక యువతులు ఆశక్తితో చూడడంలో వింత ఏమీలేదని, నేను భావించి 'ఇతను నామిత్రుడు కరుణకుమార్' అని ఆమెకు పరిచయంచేసి, అతనితో 'ఈమె, గత రెండేండ్లనుండీ మన కాలేజి అందాలరాణిగా చెలామణీ అవుతోంది. ఈ ముడు ఏండ్లలోనూ ఈమెను అందంలో అధిగమించగలవారెవ్వరూ మన కాలేజీలో చేరలేదు.

(సశేషం)

